మారిషస్ అందాలను వీక్షించ రారండి..!

బెంగళూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మారిషస్ ద్వీప అందాలను వీక్షించేందుకు దక్షిణ భారతీయులు తరలిరావాలని మారిషస్ టూరిజం ప్రమోషన్ అథారిటీ (ఎంటీపీఏ) డైరెక్టర్ అరవింద్ బందున్ పిలుపునిచ్చారు. సోమవారం బెంగళూరులో రోడ్‌షో నిర్వహించారు. వివిధ ట్రావెల్ ఏజెన్సీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ బందున్ మాట్లాడుతూ మారిషస్ ప్రత్యేకమైన సముద్రతీరాలతోపాటు ప్రకృతి రమణీయంగా ఉంటుందన్నారు. గోల్ఫ్‌కోర్టులు తమ ప్రత్యేకత అని, వెడ్డింగ్, హనీమూన్ ప్యాకేజీలు ఉన్నాయన్నారు. వీసా సులభతరమని తెలిపారు.

కట్టుదిట్టంగా జామర్లు

- జైళ్లలో యథేచ్ఛగా మొబైళ్ల వాడకంపై ప్రభుత్వం సీరియస్
- అధునాతన పరికరాల ఏర్పాటు
- ఐదేళ్లకు రూ. 11 కోట్ల వ్యయం







బెంగళూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నేర ప్రవృత్తితో దారుణాలకు పాల్పడినవారిని జైళ్లలోకి వేయడం సహజం. ఎంతటివారైనా అక్కడ కఠినమైన జీవనాన్ని సాగించాల్సి ఉంటుంది. చేసిన తప్పునకు జైళ్లలో పశ్చాత్తాపం కలగాలనేది ముఖ్య ఉద్దేశ్యం. జైళ్ల శాఖలో కొందరి నిర్లక్ష్యం, రాజకీయ జోక్యం వంటి కారణాలతో దశాబ్దాలుగా జైళ్లు విలాసవంతమైన ప్రాంతాలుగా మారిపోతున్నాయి. తరచూ జైళ్లలో మొబైల్, మద్యం, గంజాయితోపాటు ఇతరత్రా నిషేధిత వస్తువులు పట్టుబడుతున్న విషయం తెలిసిందే. జైళ్లలో మొబైల్ నెట్‌వర్క్ లేకుండా చేసేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఫలించడం లేదు. ఎంతోమంది విచారణ ఖైదీలు, శిక్షకు గురైనవారు మొబైల్ వాడకాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. అక్కడి నుంచే అన్ని వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు. బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్‌తో పాటు ఏడు జైళ్లలో టవర్స్ ఆఫ్ ది హార్మోనిస్ సెల్ బ్లాకింగ్ సిస్టమ్ (టి-హెచ్‌సీబీఎస్) టెక్నాలజీకి అనుబంధమైన మొబైల్ టవర్లను ఏర్పాటు చేశారు. వీటిని ఐదేళ్ల నిర్వహణకు రూ.11.32 కోట్లు విడుదల చేశారు. ఈ టవర్లు నిర్దేశించిన ప్రదేశంలో మొబైల్ సిగ్నల్స్ లభించకుండా పనిచేస్తాయి. వీటి నిర్వహణకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయినా ఉగ్రవాద కార్యకలాపాలు, సంఘ విద్రోహశక్తులు, హత్యల వంటి తీవ్రమైన కేసులలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నవారు స్మార్ట్ ఫోన్లను యథేచ్ఛగా వాడుతున్నారు. కొందరు జైళ్లలో కూర్చుని బయట వ్యక్తులతో వ్యవహారాలు సాగిస్తున్నారు. మరికొంత మంది బెదిరింపులకు పాల్పడి వసూళ్లు చేస్తున్నారు. పరప్పన అగ్రహార జైలులో హెచ్‌సీబీఎస్ టవర్ల ఏర్పాటుకు ఐదేళ్లకు గాను రూ.4.67 కోట్లు ఖర్చు కానుంది. మే 2న రూ.2.96 కోట్లు విడుదల చేశారు. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్‌తోపాటు రౌడీలు మొబైల్ వాడిన ఫొటోలు, వీడియోలు వైరల్ కావడం జైళ్లశాఖపై విమర్శలు వెల్లువెత్తాయి. జైళ్లశాఖ డీజీపీ మాలిని కృష్ణమూర్తికి ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. బెంగళూరు పరప్పన జైలుతోపాటు బెళగావి, విజయపుర, ధారవాడ, బళ్లారి, శివమొగ్గ, తుమకూరు సెంట్రల్ జైలుకు మొబైల్ టవర్లను ఏర్పాటు చేశారు. జామర్ సర్వీసులు కొనసాగించేందుకు రిలయెన్స్, జియోకు రూ.86.99 లక్షలు, భారతి ఎయిర్‌టెల్ లిమిటెడ్‌కు రూ.87 లక్షలు, ఒడాఫోన్ - ఐడియా సంస్థకు రూ.57 లక్షలు, 30 కేవీఏ డీజిల్ జనరేటర్లకు రూ.19లక్షలు ఖర్చు చేశారు.

ఎన్నో సంఘటనలు వెలుగులోకి..

భద్రావతి ఎమ్మెల్యే సంగమేశ్వర్ కుమారుడు బసవరాజ్ హత్యకు జైలులోని ముబారక్ అలియాస్ డిచి ముబారక్ సుపారీ ఇవ్వడం వెలుగు చూసింది. అంతే కాకుండా గతంలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరి, మహారాష్ట్రలోని నాగ్‌పూర్ కార్యాలయానికి బెళగావిలోని హిండలగా జైలు నుంచి నొటోరియస్ జయేశ్‌పూజారి ఫోన్ చేసి రూ.10కోట్లు డిమాండ్ చేశారు. జైళ్ల శాఖ డీఐజీ టీటీ శేషకు పరప్పన అగ్రహార, బెళగావి జైళ్ల నుంచే క్వార్టర్స్ పేల్చివేస్తామని బెదిరించడం, పరప్పన అగ్రహార నుంచి రౌడీ మనోజ్ ఓ యువతికి నగ్న వీడియో పంపి రూ.40వేలు వసూలు చేయడం వంటివి సంచలనమయ్యాయి. దీంతో జైళ్లశాఖలో మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.



పరప్పన అగ్రహార జైలు

కేపీఎస్ పరీక్షల్లో తప్పులు

- అభ్యర్థుల ఆగ్రహం
- మళ్లీ నిర్వహించాలని సీఎం ఆదేశం

బెంగళూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేఏఎస్ గెజిటెడ్ ప్రొబేషనరీ ఉద్యోగాల కోసం ఇటీవల కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ప్రిలిమనరీ పరీక్షల్లో భాషాపరమైన తప్పులపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ మేరకు మరోసారి ప్రిలిమనరీ పరీక్షలు నిర్వహించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించారు. 384 కేఏఎస్ గెజిటెడ్ ప్రొబేషనరీ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆగస్టు చివరి వారంలో పరీక్షలు నిర్వహించారు. కన్నడ అనువాద ప్రశ్నలు సమగ్రంగా లేకపోవడంతో అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. ఇదే విషయమై ఆందోళనలు చేశారు. రెండు నెలల్లోగా మళ్లీ పరీక్షలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ మేరకు సీఎం సోమవారం ఎక్స్ ద్వారా పోస్ట్ చేశారు. ఈలోపాలకు కారకులైనవారిని విధుల నుంచి తొలగించాలని, మళ్లీ నిర్వహించే పరీక్షల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కేపీఎస్సీ ప్రశ్నపత్రం కన్నడకు అనువాదంలో పలు తప్పులు దొర్లాయి. దీనిపై సోషల్ మీడియాలో తీవ్రమైన చర్చ జరిగింది. పరీక్షలు రాసిన అభ్యర్థులు ప్రశ్నపత్రంలోని తప్పులను పోస్టు చేసి కేపీఎస్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ కన్నడ సాహితీవేత్త బరగూరు రామచంద్రప్పతోపాటు పలువురు ప్రముఖులు కేపీఎస్సీ తీరును తప్పుబట్టారు. దీంతో ప్రభుత్వం స్పందించి మళ్లీ పరీక్షలకు ఆదేశించింది.



పలుచోట్ల భారీ వర్షం

- ఇళ్లు ధ్వంసం
- కలబురగిలో పాఠశాలలకు సెలవు


మర్చడ్ గ్రామంలో పడిపోయిన ఇంటి గోడలు


కలబురగి పట్టణంలో జలమయమైన రహదారి

బెంగళూరు/రాయచూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపి లేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. కలబురగి, రాయచూరు జిల్లాల్లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న నిరంతర వర్షాలతో పలు రహదారులు జలమయమయ్యాయి. దీంతో జనజీవనం స్తంభించడంతో కలబురగి జిల్లా యంత్రాంగం సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించింది. చిత్తాపుర తాలూకా ఆలూరు గ్రామంలో ఇంటిపై ఓ గోడ కూలడంతో అపారనష్టం

- గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం
- రాయచూరులో లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధం

వాటిల్లింది. చన్నప్పచోళికి చెందిన ఇంటిపై సమీపంలోని గుట్టపై నుంచి రాళ్లు అదుపుతప్పి పడ్డాయి. దీంతో ఇంట్లోని సామగ్రి పూర్తిగా దెబ్బతింది. నిత్యావసరాలు, ధాన్యం, ఇతర సామగ్రి మట్టిపాలైంది. దీంతో సుమారు రూ.7 లక్షలు నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. సమాచారం అందుకున్న రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పలుచోట్ల గ్రామాల్లో ఇళ్లకు పాక్షికంగా నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇబ్బంది పడకుండా ముందస్తుగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. రాయచూరు జిల్లాలో వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల జిల్లాలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జిల్లా కేంద్రం రాయచూరు నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం కాగా రోడ్లపైకి వర్షపు నీరు వచ్చి చేరుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక నిజలింగప్ప కాలనీలోని పురాతన వృక్షం ఒకటి వర్షం, గాలుల దెబ్బకు కూలిపోగా ఆ సమయంలో సమీపంలో ఎవ్వరులేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న నగరసభ సిబ్బంది అక్కడికి చేరుకుని విరిగిన చెట్టుకొమ్మలను తొలగించారు. తాలూకాలోని మర్చడ్ గ్రామంలో పలు ఇళ్లు కూలిపడిపోగా కుటుంబాల వారు నిరాశ్రయులుగా మిగిలారు. మరికొన్ని ఇళ్లల్లో గోడలు కూలిపోయి ఇబ్బందులకు గురయ్యారు. ఎక్కడా ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. పలు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పొలం పనులు చేసుకునే వారు ఇబ్బందులకు గురయ్యారు. వర్షపునీరు పెద్ద ఎత్తున వచ్చి చేరడంతో పత్తి, కంది, తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మన్సలాపూర్ గ్రామ చెరువు నిండి అలుగుపడడంతో పాటు వాగు పొంగిపొర్లుతుండడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దేవదుర్గ తాలూకా జాలహళ్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాగుపై నిర్మించిన వంతెన కూలిపోగా దాదాపు 4-5 గ్రామాల వారికి రాకపోకలకు అసౌకర్యంగా మారింది. మరో రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చేస్తున్న హెచ్చరికలతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు.


రాయచూరులో కూలిపోయిన పురాతన వృక్షం


హట్టి వద్ద పొలాల్లో నిలిచి ఉన్న వర్షపు నీరు


కలబురగిలో దెబ్బతిన్న గోడ

శత వేగంగా తుంగభద్ర..!



- వంద టీఎంసీలకు చేరువలో టీబీ డ్యాం
- ఎగువ వర్షాలతో పోటెత్తుతున్న వరద
- నేడు ఇన్‌ఫ్లో పెరిగే వకాశం
- ఆయకట్టు రైతుల్లో హర్షం


జలకళతో తుంగభద్ర జలాశయం

బళ్లారి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుంగభద్రకు వరద పోటెత్తుతోంది. జలాశయంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. డ్యాం 19వ క్రస్ట్ గేటు విరిగిపోవడంతో నీరు వృథాగా పోయి అన్నదాత ఆవేదన పడిన సంగతి తెలిసిందే. వారం రోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో డ్యాంలో మళ్లీ జలకళ ఉప్పొంగుతోంది. సోమవారం సాయంత్రానికి 99 టీఎంసీల నీరు చేరింది. మంగళవారానికి 100 టీఎంసీలు కావచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆగస్టు 10న ప్రమాదంతో క్రస్ట్ గేటు విరిగిపోయి నీరు వృథాగా పోతుండంతో మూడు రాష్ట్రాల రైతుల్లో ఆందోళన నెలకొంది. సాగునే నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమకు ఈ ఏడు కూడా కష్టాలు తప్పవని ఆందోళన చెందారు. డ్యాం ఖాళీ అయితే తమ పరిస్థితి ఏమిటని బాధ పడ్డారు. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు ఆధ్వర్యంలో కార్మికులు శ్రమించి మరమ్మతులు చేపట్టడంతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. క్రస్ట్ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ అమర్చి డ్యాంలో నీరు నిల్వకు కృషి చేశారు. ఆగస్టు 13న ముఖ్యమంత్రి సిద్దరామయ్య తుంగభద్ర డ్యాంను పరిశీలించారు. నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ జలాశయం మళ్లీ నిండుతుంది.. తానే వచ్చి వాయనం ఇస్తాను అని ధీమా వ్యక్తం చేశారు. వరుణుడు కరుణించి జోరుగా వర్షాలు కురిపిస్తుండంతో తుంగభద్ర మళ్లీ జలకళ సంతరించుకుంది. డ్యాం అధికారులు సోమవారం ఉదయం ప్రకటించిన నీటి లెక్కల ప్రకారం నీరు 98.961 టీఎంసీలకు చేరింది. ఇన్‌ఫ్లో 33,789 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో వివిధ కాలవలతో పాటు నదికి విడుదల చేస్తున్న నీరు 15,400 క్యూసెక్కులుగా ఉంది. గత పదేళ్ల నాటి నీటి లభ్యతను పరిశీలిస్తే ప్రస్తుత ఏడాది మెరుగ్గా ఉందని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. తుంగభద్ర డ్యాంలో నిండుకుండలా నీరు ఉండడం, కాలవలకు నీరు పుష్కలంగా వస్తుండంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిషేధం ఉన్నా.. విచ్చలవిడిగా పీఓపీ గణపతులు

- మట్టి వినాయకులకు పెరుగుతున్న ఆదరణ


పీఓపీతో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలు


విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు

బెంగళూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతులనే పూజించాలని, కలుషితమైన రంగులతో పెను ప్రమాదమని కాలుష్యనియంత్రణ మండలి ఏళ్ల తరబడి విస్తృతంగా ప్రచారం చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. నగరంలో పలుచోట్ల పీఓపీ గణపతులను యథేచ్ఛగా తయారు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా పీఓపీ గణపతులను ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. అయినా అక్కడక్కడా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గణపతుల తయారీ కొనసాగుతోంది. నగరంలో వందలాది స్వచ్ఛంద సంస్థలు మట్టిగణపతుల తయారీపై అవగాహన కల్పిస్తున్నాయి. వేలకొద్దీ ఉచితంగా గణపతులు అందిస్తున్నాయి. మరో నాలుగు రోజుల్లో వినాయక చవితి వేడుకలు వస్తున్నందున మట్టి గణపతులతో పాటు పీఓపీ గణపతుల విక్రయాలు సాగుతున్నాయి. బెంగళూరుతోపాటు నగర పాలక సంస్థలు, గ్రామపంచాయతీలు పీఓపీ గణపతుల తయారీ, విక్రయాలపై దాడులు జరుపుతున్నాయి. నగరంలోని పాటరీటౌన్ తదితర ప్రాంతాల్లో మట్టి విగ్రహాల తయారీ ఉద్యమంలా చేస్తున్నారు.


విగ్రహాల తయారీ శిబిరంలో విద్యార్థులు


చిన్నారులు తయారు చేసిన మట్టిగణనాథులు



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.02	1,624.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	32,000	813
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,459	10,053
సామర్థ్యం (టీఎంసీలు)	98.72	75.39

విద్యాసంస్థల సమీపంలో పొగాకు అమ్మితే కఠిన చర్యలు

● నియంత్రణాధికారుల హెచ్చరిక

బళ్లారి సిటీ, సెప్టెంబరు 2: విద్యాసంస్థలకు వంద మీటర్ల దూరంలో పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి డాక్టర్, మరియంబి పేర్కొన్నారు. సోమవారం బళ్లారి రూరల్ ప్రదేశంలో దారంమిల్లు, అల్లీపూర్ , బీబీటీఎం కళశాల, పరిసర ప్రాంతాల్లోని దుకాణాలపై ఆయన దాడులు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో పొగరాకుండా చూసుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యమన్నారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు అమ్మడం, శిక్షార్హమైన నేరమని, నేరం రుజువైతే షాపు యజమాని బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం కోటా చట్టం 2003ని ఉల్లంఘించి విక్రయిస్తున్న 21 దుకాణాలపై దాడులు చేసి జరిమానా విధించారు. రెండు దుకాణాల ముందు ఉంచిన పొగాకు వినియోగాన్ని ప్రోత్సహించే బోర్డులను తొలగించారు. కార్యక్రమంలో సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గోవిందప్ప, జిల్లాపొగాకు సలహాదారుడు ప్రశాంత్, సామాజిక కార్యకర్తలు సరస్వతివ, పోలీస్ శాఖ సిబ్బంది శరణప్ప, హోంగార్డు భీమా తదితరులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదు


● డాక్టర్ మనోహర్ పత్తార్



రాయచూరు, సెప్టెంబరు 2: మానసిక వ్యాధిగ్రస్తులుగా మారిన వారి పట్ల వివక్ష చూపకుండా వారిపట్ల సానుకూలదృక్పథంతో వ్యవహరించాలని నగరానికి చెందిన ప్రముఖ మానసిక వైద్యుడు మనోహర్ పత్తార్ సూచించారు. గ్రామీణ ప్రాంత వైద్యుల కోసం సోమవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మానసిక వ్యాధుల అవగాహన కార్యక్రమంలో డాక్టర్ పత్తార్ మాట్లాడారు. మానసిక వ్యాధి ఉన్న వారి ప్రవర్తన, మాటతీరు, నడవడికలో మార్పు ఉంటుందన్నారు. అందుకు సంబంధించిన లక్షణాలను వివరించారు. సకాలంలో చికిత్స అందించడం ద్వారా వారికి పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఈ విషయంలో వారి పట్ల చులకన భావం చూపితే వారిలో లక్షణాలు ముదురే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. మానసిక రోగుల పట్ల వివక్ష చూపే వారిని చట్టపరంగా శిక్షించే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. మానసిక వ్యాధికి కారణాలు, బాధితుల్లో కనిపించే ప్రాథమిక లక్షణాలు, అనంతరం వారి ప్రవర్తన తదితర అంశాల గురించి డాక్టర్ మనోహర్ పత్తార్ వివరించారు.

శంభో.. సోమేశ్వరా..!

భక్తుల నడుమ సాగుతున్న దిబ్బల సోమేశ్వరస్వామి రథోత్సవం



వైభవంగా దిబ్బల సోమేశ్వర రథోత్సవం

పోటెత్తిన భక్తులు



ఎద్దుల బండిపై ఊరేగుతున్న కిన్నిరేశ్వరస్వామి

కంప్లి, సెప్టెంబరు 2: శంభో సోమేశ్వరా..అంటూ శివనామస్మరణ మార్మోగింది. కంప్లి పరిధిలోని చివరి గ్రామ పంచాయతీ అయిన బసరకోడు గ్రామంలో వేదవతి నది ఒడ్డున వెలసిన దిబ్బల సోమేశ్వరస్వామి రథోత్సవం శ్రావణ అమావాస్య సందర్భంగా సోమవారం వైభవంగా జరిగింది. శంభులింగ శివాచార్య స్వాములు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పురోహితులు మంజునాథ్, విజయ్‌కుమార్ దిబ్బల సోమేశ్వర స్వామికు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దుల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు. బుక్కసాగర వద్ద వుండే కిన్నిరేశ్వర స్వామి రథోత్సవం కూడా వైభవంగా జరిగింది. విరుపయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం బుక్కసాగర, రామసాగర, వెంకటాపురం, కమలాపురం, హోస్పేట గ్రామాల నుంచి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూలు, పండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు. భక్తులు రథోత్సవాలు కనుల పండువగా నిర్వహించుకున్నారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.



మట్టి విగ్రహాల ప్రదర్శనలో డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా, విద్యార్థులు

పర్యావరణాన్ని కాపాడుకుందాం: డీసీ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 2: పండుగల పేరుతో పర్యావరణాన్ని కలుషితం చేయరాదని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, రసాయనిక రంగులు వేసిన గణేశ్ విగ్రహాలను కాకుండా మట్టి విగ్రహాలతో పూజలు నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా పిలుపునిచ్చారు. నగరంలోని బెల్గల్‌క్రాస్‌లోని ఆటవీ శాఖ నర్సరీ ప్రకృతి భవన్‌లో సోమవారం ఆటవీశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన పర్యావరణహిత గణేశ్ విగ్రహాల తయారీ కార్యశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానువుడికి సమస్త సౌకర్యాలు అందించే ప్రకృతిని కాపాడుకోవాలని, సమస్త జీవరాశులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనన్నారు. పీఓపి రంగుల విగ్రహాలను పూజించి వాటిని సరస్సులు బావులు , కాలువల్లో నిమజ్జనం చేస్తే సహజ నీటి వనరులు కలుషితమవుతాయన్నారు. అవి ప్రకృతి వనరులపై ప్రభావితం చూపుతాయన్నారు. జంతువులు, పక్షులు, జలచరాలు, ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. సరస్సులు, చెరువుల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వేయడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. బళ్లారి రీజనల్ డివిజన్ డిప్యూటీ ఫారెస్ట్ కన్జర్వేటర్ సందీప్ సూర్యవంశీ మాట్లాడుతూ గణేశ్ పండుగ సందర్భంగా పర్యావరణ హిత గణేశ్ విగ్రహాలతో సంబరాలు జరుపుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇంటి ముందు మొక్కలు నాటడంలో అందరూ ముందుకు రావాలన్నారు. ఉత్సవాల్లో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదన్నారు. పారా స్విమ్మర్ కవిత, డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సునీల్ కుమార్ చౌహాన్, అసిస్టెంట్ ఫారెస్ట్ కన్జర్వేటర్ శరణ్‌కుమార్, జోనల్ ఫారెస్ట్ ఆఫీసర్ గిరీశ్‌కుమార్, పెట్రోలింగ్ వార్డెన్ ఫారెస్ట్ సునీల్‌కుమార్ చౌహాన్, అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరణ్‌కుమార్, పెట్రోలింగ్ వార్డెన్ ఫారెస్ట్ కన్జర్వేటర్లు హనుమేశ్, అశోక్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను చిన్నారులు ప్రదర్శించారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



శోభాయాత్రలో శ్రీకృష్ణుడు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 2: అమావాస్య సందర్భంగా కంప్లి తాలుకా పరిధిలోని గ్రామాల్లో, పట్టణాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కృష్ణాష్టమి సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం హొసపేట బీజేపీ పార్టీ కార్యాలయంలో శ్రీకృష్ణుని శోభాయాత్ర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు వీరయ్య పల్లి మాట్లాడుతూ భూమిపై జన్మించి ఎందరికో దారి చూపిన మహనీయుడు శ్రీకృష్ణుడు అన్నారు. ఊరేగింపులో కమిటీ సభ్యులు శ్రీదేవి, రాఘవేంద్ర, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు,కృష్ణ, సుదాకర్, అరుణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సిరుగుప్ప: శ్రావణమాసం చివరి సోమవారం పురస్కరించుకుని బీజేపీ అగ్రనాయకులు రాధాధరప్ప నాయక దంపతులు గాలిమారెమ్మదేవికి పూజలు జరిపారు. కమిటీ సభ్యులు పూలమాలలతో సన్మానించారు.

కంప్లి : అమావాస్య సందర్భంగా కంప్లి తాలుకా పరిధిలోని గ్రామాల్లో, పట్టణాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అమావాస్య సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజలు చేపట్టారు. షుగర్ ఫ్యాక్టరీలోని కాళికాదేవి ఆలయంలోను ఆలదమర (బసిరి చెట్టు) నాగప్పకు, దిబ్బల సోమేశ్వర, బుక్కసాగర వద్ద వుండే కిన్నిరేశ్వర ఆలయాల్లో అమావాస్య సందర్భంగా భక్తాదులు పూజలు నిర్వహించుకున్నారు. ఆలయాల్లో జలాభిషేకం, అమృతాభిషేకాలు, పుష్పాభిషేకం, మహామంగళహారతి, ఆకుపూజ, కుంకుమార్చన, తదితర పూజలు జరిగాయి. ఈ శ్రావణమాసం చివరి రోజు కావడంతో బుక్కసాగర వద్ద వుండే ఏళుపడగల నాగప్ప ఆలయంలో పుట్టలో పాలుపోసి భక్తాదులు మొక్కులు కూడా సమర్పించుకున్నారు. మొత్తానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో రద్దీగా వున్నాయి.

బళ్లారిరూరల్: నగరంలో వర బసవేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం చివరి సోమవారం అమావాస్య సందర్భంగా వర బసవేశ్వర రథోత్సవాన్ని సాయంత్రం లాగుతున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. మాజీమంత్రి శ్రీరాములు తదితర ప్రముఖులు పూజలు నిర్వహించారు.

ఎర్రితాతకు విశేష పూజలు

అమావాస్య సందర్భంగా ఎర్రితాతకు విశేష పూజలు నిర్వహించారు. తాలుకాలోని ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో వెలిసిన చేళగుర్కి ఎర్రితాతకు సోమవారం విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలనగౌడ, పదాధికారులు తెలిపారు.











పత్యేకాలంకరణలో యర్రితాత దిబ్బల సోమేశ్వరుడు కిన్నిరేశ్వర స్వామి మహాశివుడు అమ్మవారు

పండుగలను ప్రశాంతంగా చేసుకోండి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేష్

సిరుగుప్ప, సెప్టెంబరు 2: వినాయక చవితి, ఈద్ మిలాద్ నబీ పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ వెంకటేష్ సూచించారు. సోమవారం సిరుగుప్ప పట్టణ పోలీస్ స్టేషన్‌లో పండుగ వేడుకల సందర్భంగా పూర్వాపరాల సమావేశం జరిగింది. సమావేశంలో డీఎస్పీ వెంకటేష్ మాట్లాడుతూ పండగలను ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా శాంతియుతంగా పండుగ జరుపుకోవాలన్నారు. వినాయక చవితి, ఈద్ మిలాద్ పండుగలు ఒకేసారి రావడంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సీఐ హనుమంతప్ప, ఎస్ఐ పరశురామ్, టెక్కలకోట ఎస్ఐ శ్రీనివాస, అచ్చొళ్లి ఎస్ఐ కుమారస్వామి, ముస్లిం సహోదరులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

కంప్లి: రానున్న వినాయకచవితి, ఈద్ మిలాన్ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ ప్రసాద్ గోఖలే తెలిపారు. సోమవారం కంప్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతిసభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ పండుగను అన్ని మతాల వారు ఐక్యతతో జరుపుకోవాలన్నారు. ఎవరైనా ఘర్షణలకు దిగితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి గ్రామంలోని నాయకులు ఎలాంటి సంఘటనలు జరుగకుండా బాధ్యత నిర్వహించాలన్నారు. వినాయకున్ని కూర్చోబెట్టే మండపాల్లో కమిటీ వారు సందర్శించి అనుమతులు తీసుకుని మండపాల్లో వినాయకున్ని ప్రతిష్ఠించాలన్నారు. ఈద్‌మిలాన్ పండుగ రోజు ప్రశాంతంగా ప్రార్థనలు నిర్వహించుకోవాలని, ఎవరు ఏ మతం వారైనా ఎలాంటి సంఘటనలకు పాల్పడినా వారిపై నిఘా వుంచుతామన్నారు. ఇప్పటికీ పోలీసులను ఆయా గ్రామాల్లో విధుల్లో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వాసుకుమార్, ముఖ్య అధికారి దుర్గన్న, పురసభ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

బళ్లారిరూరల్ : తాలుకాలోని మోకా హనీ ఫంక్షన్‌లో వినాయక చవితి శాంతి సభను సీఐ రుద్రప్ప, ఎస్ఐ కాళింగ నేతృత్వంలో 28 గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగ సభను నిర్వహించారు. శాంతిసభలో ఎస్ఐ కాళింగ మాట్లాడుతూ పండుగను గ్రామాల ప్రజలు ఆధ్వర్యంలో శాంతియుతంగా జరుపుకోవాలని పలు గ్రామాల ప్రజలకు సూచనలు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పర్మిషన్ తీసుకుని గ్రామంలో వినాయకున్ని కూర్చోపెట్టాలని గ్రామాల ప్రజలకు పలు సూచనలు తెలిపారు. కార్యక్రమంలో పలు గ్రామాల ప్రముఖులు గ్రామ పంచాయ తీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భూముల కోసం రైతుల నిర్విరామ పోరాటం

కంప్లి, సెప్టెంబరు 2: కర్మాగారాలకు భూములు కోల్పోయిన రైతులు చేపట్టిన పోరాటం కొనసాగుతూనే ఉంది. తమకు న్యాయం జరిగే వరకు నిరసనలు, పోరాటాలు ఆపేది లేదని రైతు సంఘం నాయకులు జంగ్లిసాబ్, భావి శివకుమార్, తిప్పేస్వామి తదితరులు తెలిపారు. పది సంవత్సరాలకు పైగా కుడితిని పరిధిలోని హరిగిణదోణి, జానెకుంట, కలగల్లు, యర్రంగళి, సిద్దమ్మనహళ్లి, వేణి వీరాపురం, కుడితిని తదితర ఆరు గ్రామాలకుపైగా ఎన్ఎండీసీ, బ్రాహ్మణి, లక్ష్మీమిట్టల్ కర్మాగారాలకు భూములు కోల్పోయారు. కర్మాగారాలు ఏర్పడి తమ ఇళ్లల్లో సభ్యులకు ఉద్యోగాలు వస్తాయని ఆశపడినప్పటికీ ఇంతవరకు ఏ ఫ్యాక్టరీ ఏర్పడలేదు. రైతులకు న్యాయం జరుగలేదన్నారు. న్యాయం కోసం కుడితినిలో 625 రోజులుగా రైతులు నిరసనలు చేపడుతున్నారు. వర్షాలు, ఎండ, గాలిని తట్టుకుని రైతులు నిరసనలు చేస్తున్నా కానీ రోడ్డుపై ఎంతో మంది నాయకులు విమానాశ్రయానికి వెళుతూ చూస్తున్నారే తప్ప రైతన్నలను ఆదుకోవడంలో మాత్రం విఫలమవుతున్నారన్నారు. ఇదిగో అదిగో తమకు న్యాయం చేస్తామని చెబుతున్నారే తప్ప ఇంతవరకు ఏ పార్టీ నాయకులు గానీ, స్థానిక ఎంపీ వుండి కూడా తమకు న్యాయం జరుగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పోరాటం ఎన్ని రోజులు గడిచినా రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం తప్పదని సూచించారు. కార్యక్రమంలో వారితోపాటు తిమ్మప్ప, సంపత్, రైతులు నాగరాజు, భీమన్న పాల్గొన్నారు.



కుడితినిలో నిరసన తెలుపుతున్న రైతులు

బైక్‌ల దొంగ అరెస్టు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 2: కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల్లో పలుచోట్ల 16 ద్విచక్రవాహనాలను చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవిబాబు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సోమవారం వెల్లడించారు. కుందుర్పి మండలం బోదపల్లికి చెందిన పాతన్న అనంతపురం, కళ్యాణదుర్గం, బెళుగుప్ప, కర్ణాటకలోని బళ్లారి, పావగడ పోలీస్‌స్టేషన్‌లలో 23 పాత కేసులలో నిందితుడని తెలిపారు. పట్టణంలోని ఉమానగర్‌లో ఓ ద్విచక్రవాహనం చోరీ కావడంతో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టి పాత నేరస్తులను విచారించగా సూత్రధారిగా పాతన్న పేరు బయటపడిందన్నారు. దీంతో అతడిని అరెస్టు చేసి 16 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ హరినాథ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

నోటు పుస్తకాల పంపిణీ

రాయచూరు సెప్టెంబర్ 2: కర్ణాటక విద్యార్థి సంక్షేమ అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షు రాజేశ్ కుమార్ సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా నగరంలోని కేఈబీ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. రాజేశ్ కుమార్ కరోనా సమయంలోను ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి విద్యార్థులకు పలు తోడ్పాటు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు అంటుకుపోవడాన్ని ప్రస్తావిస్తు ఆ దురలవాటు నుంచి బయట పడాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు విద్యార్థులను నియంత్రించి చదువుపై దృష్టి సారించేలా తగిన వాతావరణం కల్పించాలన్నారు. ఉద్యోగులు, హెడ్‌మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలి

● పెన్షనర్ల సంఘం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం సభ్యులు

హోసూరు(సిఫ్‌కాట్) సెప్టెంబరు 2: సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని పెన్షనర్స్ అసోషియేషన్ డిమాండ్ చేసింది. తమిళనాడు ప్రభుత్వ అన్ని రంగాల పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కౌన్సిల్ సమావేశం సోమవారం హోసూరులో జరిగింది. ఈ సందర్భంగా వారు పలు డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు దురై అధ్యక్షత వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు శరవణన్ స్వాగతం పలికారు. ఉపాధ్యక్షుడు నాగరాజన్ తిరునావుకరసు, సంయుక్త కార్యదర్శులు అధ్యక్షత వహించారు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు సభను ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి మురుగన్ పనితీరు నివేదికను, కోశాధికారి రవి చంద్ర బడ్జెట్ నివేదికను సమర్పించారు. యాక్షన్ రిపోర్ట్ కోశాధికారి రవి చంద్రన్ బడ్జెట్ నివేదికను చదివి వినిపించారు. రాష్ట్ర కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు. హోసూరును రాజదాని చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సర్కిల్ శాఖ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశం కృతజ్ఞతలు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ 4 జీ సేవలపై హర్షం

హోసూరు, సెప్టెంబరు 2: పట్టణంలోని పారిశ్రామిక వాడలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంబించడంపై హర్షం వ్యక్తం అవుతోంది. సోమవారం నుంచి పలు ప్రాంతాల్లో 4జీ సేవలు ప్రాంభించినట్లు వారు తెలిపారు. హోసూరు కార్పొరేషన్‌లో 300 కు పైగా భారీ పరిశ్రమలు, 3 వేలకు పైగా చిన్న, సూక్ష్మ పరిశ్రమలు నెలకొని ఉన్నాయి. టాటా ఎలక్ట్రానిక్స్‌లో మొబైల్ ఫోన్‌ల తయారీ కర్మాగారాల్లో 50 వేల మందికి పైగా పనిచేస్తున్నారు. ఇటీవల ప్రైవేట్ టెలికాం కంపెనీలు ధరలు భారీగా పెంచడంతో ప్రజలు బీఎస్ఎన్ఎల్ వైపు వస్తున్నారు. ఇప్పుడు 4 జీ సేవలు అందించడంపై మరింత మంది ఆసక్తి చూపుతున్నారు.

డీఎంకేలో కార్యకర్తలే కీలకం

● పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు



సమావేశంలో ప్రసంగిస్తున్న పార్టీ నేత

హోసూరు, సెప్టెంబరు 2: డీఎంకే పార్టీకి కార్యకర్తలే బలమని నేతలు ప్రశంసించారు. యూనియన్ డీఎంకే సభ్యుల సమావేశం సోమవారం స్థానిక సపలమ్మ దేవాలయంలో జరిగింది. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ అధ్యక్షత వహించారు. యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి అందరికీ స్వాగతం పలికారు. నిర్వాహకులు వీరభద్రప్ప, సునీత మురళీ కుమార్, సంపత్ కుమార్, రామమూర్తి, రమేశ్, మునిరజ్, అనితా మునిరాజ్, మంజునాథప్ప, ప్రత్యేక ఆహ్వానితులుగా పశ్చిమ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ సత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ డీఎంకే ట్రిపుల్ జూబ్లీ పగడాల వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. సెప్టెంబరు 15 తత్వవేత్త అన్నా జయంతి ఆ రోజున నగర వ్యాప్తంగా 45 వార్డుల్లో జెండా ఎగురవేసి సంబరాలు చేసుకోవాలన్నారు. పారిశ్రామికాభివృద్ధిల్లో తమిళనాడును అగ్రగామిగా నిలిపేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికా వెళ్లిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. చరిత్రలో చెరగని విజయాలను అర్థం చేసుకున్న జాతీయ నాయకుడు కరుణానిధి శత జయంతి స్మారక నాణెం విడుదలకు కృషి చేసిన స్టాలిన్‌కు ధన్యవాదాలు తెలిపారు. రైల్వే ప్రాజెక్టులు సహ పలు మార్గాల్లో కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా కేంద్ర మోదీ ప్రభుత్వం తమిళనాడును మోసం చేస్తునే ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖకు గత ఆర్థిక సంవత్సరం, ప్రస్తుత సంవత్సరం రావాల్సిన నిధులు కేటాయించలేదన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల ద్వారా ప్రతి రోజూ వివిధ పథకాలను అమలు చేయడం మాతృమూర్తి నాయకుడి లక్ష్యమని, రానున్న ఎన్నికల్లో 200 సీట్లు సాధించడమే ధ్యేమన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్తు అధ్యక్షుడు యువరాజ్, చిన్నస్వామి సుప్పసర్వేశ్, సుకుమారన్, ఎల్లోర మణి, వీరారెడ్డి, క్రిష్, శ్రీనివాసన్, విజయకుమార్, అరియప్పన్, ధనలక్ష్మి, శ్రీనివాసన్, చిన్నపిల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల అసోసియేషన్ ప్రారంభం

హోసూరు, సెప్టెంబరు 2: పట్టణంలో ఆటోడ్రైవర్ల అసోసియేషన్ సమావేశం సోమవారం జరిగింది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సముదాయం ఎదురుగా హోసూరు రాయకోట రోడ్డులోని కారుపల్లి సమీపంల్లో తమిళనాడు జీవన హక్కుల పార్టీ జెండాను ఎగురవేసి ఆటో డ్రైవర్లు సంఘం నేమ్ బోర్డును ఆవిష్కరించారు. జీవన హక్కుల పార్టీ శాఖ ప్రారంభోత్సవం, ఆటో డ్రైవర్లు సంఘం నేమ్ బోర్డు అవిష్కరణ సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంల్లో లేబర్ యూనియన్ సభ్యులు జెండా ఎగురవేశారు. కార్యక్రమానికి సంఘం ముఖ్య కార్యదర్శి కన్నన్, జంబులింగం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి తమిళనాడు జీవన హక్కుల సంఘం ఇన్‌చార్జి సానసంద్రం కార్తీక్, రాజా, మారిముత్తు, కావేరి, మాదయ్యన్, గోవిందరాజ్, బసవరాజ్, ఏర్పాట్లు చేశారు. కృష్ణగిరి జిల్లా జాయింట్ కో ఆర్డినేటర్, నెపోలియన్, మన్సూర్, కార్తీక్, ఆటో డ్రైవర్లు బాషా, మంజునాథ్, మురుగన్, పార్టీ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.



నూతనంగా ఏర్పడిన కార్యవర్గం

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

హోసూరు(కృష్ణగిరి) సెప్టెంబరు 2: ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కృష్ణగిరి జిల్లాలో హెచ్ఐవీ, ఏయిడ్స్‌పై ఆగస్టు 12నుంచి అక్టోబరు 12వరకు వరకు జిల్లా స్థాయి విస్తృత ప్రచారం జరుగుతోంది. సోమవారం కృష్ణగిరి కొత్త బస్టాండ్‌లో ఎస్‌టీడిపై విస్తృత అవగాహన ప్రచారం నిర్వహించారు. కొత్త బస్ స్టేషన్ నుంచి అన్నాశిలై వరకు మానవహారం ప్రారంభించగా, అన్నకళాశాల, కుంసక కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు, అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి తన ఆటో రిక్షాపై అవగాహన నినాదాలతో అవగాహన కల్పించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అరుళ్, ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి రెసిడెంట్ డాక్టర్ మదు, కాంపౌండ్ మెడిసిన్ డాక్టర్ జగన్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు షణ్ముగవేల్, బ్లడ్ బాంక్ డాక్టర్ వసంతకుమార్, హోప్ సెంటర్, వేల్ నెస్ సెంటర్ సిబ్బంది, వాలంటీర్స్ ఆర్గనైజేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ ఆర్గనైజేషన్, పాసిప్ నెట్‌వర్క్ ఆర్గనైజేషన్ పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

పండిట్ కిషన్ మహారాజ్ (జయంతి)



జాతీయస్థాయిలో పేరొందిన తబలా వాద్యకారుడు పండిట్ కిషన్ మహారాజ్ 1923 సెప్టెంబరు 3న బెనారస్ (వారణాసి) ప్రాం తంలో జన్మించారు. హిందూస్తానీ సంగీతంలో ఒకటైన 'బెనారస్ ఘ రానా'లో రాణించారు. ఢోలు, మృదంగం, పక్వాజ్ తదితర వాయిద్యాల ఆలాపనలోనూ రాణించారు. సితార్, సరోద్, ధృపద్, ధమార్ తదితర కళాకారులతో కలసి కచేరీలు ప్రదర్శించారు. పద్మశ్రీ, పద్మ విభూషణ్ గ్రహీ త. ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చారు. 2008 మే 4న కన్నుమూశారు.

మాయవరం సరస్వతీ అమ్మాళ్ (జయంతి)



వేణుగాన విద్వాంసురాలు మాయవరం సరస్వతీ అమ్మాళ్ 1921 సెప్టెంబరు 3న తమిళనాడు రాష్ట్రం తిరువారూర్ జిల్లా మన్నార్‌గుడి పట్టణంలో జన్మించారు. చిన్నతనం నుంచే శాస్త్రీయ సంగీతంపై ఆసక్తి పెంచుకుని రాణించారు. ప్రత్యేకించి వేణుగానంలో పేరొందారు. పద్మ సుబ్రమణ్యం, వైజయంతి బాలి వంటి ప్రముఖులతో కలసి ప్రపంచ వ్యాప్తంగా పర్యటించారు. భక్తిపాటలతో భజనలు, కావడిచిందు వంటి వా టికి సంగీతం అందించారు. జీవితసాఫల్య పుర స్కారం, సంగీత నాటక అకాడమీ ఠాగూర్ పురస్కారం ఇతరత్రా గౌరవాలు అందుకున్నారు. 2013 ఆగస్టు 17న కన్నుమూశారు.

సద్గురు జగ్గీ వాసుదేవ్ (పుట్టినరోజు)



'పద్మవిభూషణ్' గ్రహీత జగ్గీ వాసుదేవ్ 1957 సెప్టెంబరు 3న మైసూరు ప్రాంతంలో జన్మించారు. యోగిగా, రచయితగా 'సద్గురు'గా పేరొందారు. కోయంబత్తూరులో ఇషా ఫౌండేషన్ ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి యోగాను నేర్పిస్తున్నారు. విద్య, పర్యా వరణంపై అవగాహన కల్పిస్తూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందిస్తున్నారు. గ్రీన్ హ్యాండ్స్, ర్యాలీ ఫర్ రివర్స్, కావేరీ కాలింగ్ వంటి అభియానలతో దేశ వ్యాప్తంగా ప్రజలలో చైతన్యం తెచ్చారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి పాటుపడుతున్నారు.

ప్యారేలాల్ (పుట్టినరోజు)



ప్రముఖ సంగీత దర్శకులలో ఒకరైన ప్యారేలాల్ రామ్ ప్రసాద్ శర్మ 1940 సెప్టెంబరు 3న జన్మించారు. సంగీతంలో తండ్రి పండిట్ రామ్‌ప్రసాద్ శర్మ (బాబాజీ) వద్ద ఓనమాలు దిద్దారు. 'లక్ష్మీకాంత్-ప్యారేలాల్' విజయవంతంగా సాగిన భార తీయ సంగీత దర్శకుల ద్వయం. హిందీ చిత్ర రంగానికి వీరిని రమేష్‌నాయుడు పరిచయం చేశారు. 1963-98వరకు సుమారు 750 సినిమాలకు సంగీతం అందించారు. ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. లక్ష్మీ కాంత్ మృతి తర్వాత కూడా ప్యారేలాల్ తన తదుపరి స్వరకల్పనలకు 'లక్ష్మీకాంత్-ప్యారేలాల్' గానే కొన సాగిం చారు. సంగీతంలో సృజనాత్మకతకు సచిన్‌దేవ్ బర్మన్ ఇంటర్నేషనల్ అవార్డ్ అందుకున్నారు.

సాక్షి మాలిక్ (పుట్టినరోజు)



ఫ్రీస్టైల్ రెజ్లర్ (మల్ల యోధురాలు) సాక్షి మాలిక్ 1992 సెప్టెంబరు 3న హరియాణ రాష్ట్రం రోహతక్ ప్రాంతంలో జన్మించారు. 2014లో సమ్మర్ కామన్వెల్త్ గేమ్స్‌లో కుస్తీలో రజత పతకం, 2015లో కాంస్య పతకం, 2016 వేసవి ఒలింపిక్స్‌లో 58 కిలోల విభా గంలో కాంస్యపతకం సాధించిన తొలి మహిళ. 2022 బర్మింగ్‌హ్యామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారుపతకం సాధించారు. పద్మశ్రీ, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పుర స్కారాలు అందుకున్నారు.

ఆటోను ఢీకొన్న వాహనం

ఒకరి మృతి.. 14 మందికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 2: కంబదూరు మండలం కుర్లపల్లి, మేలుకుంట క్రాస్‌లో వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను బొలెరో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కూలీ అన్నపూర్ణమ్మ (50) మృతి చెందారు. మరో 14 మంది కూలీలు గాయపడ్డారు. కర్ణాటకలోని రొప్పం గ్రామానికి చెందిన 15 మంది కూలీలు టమోటా పంటను కోసేందుకు కంబదూరు మండలం కుర్లపల్లికు వస్తుండగా.. బొలెరో ఢీకొట్టింది. ఈ వేగానికి ఆటో మూడు పల్టీలు కొట్టడంతో కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలిస్తుండగా అన్నపూర్ణమ్మ మృతిచెందారు. బాధితులకు కళ్యాణదుర్గం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఆటోడ్రైవర్ రాముకు రెండుకాళ్లు విరిగిపోయాయి. కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదంలో గాయపడిన కూలీలు

పవన్ అభిమానుల రక్తదానం

▸▸ 141 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాతలకు ప్రశంసాపత్రం అందజేత

బాగేపల్లి, సెప్టెంబరు 2: జనసేనాని, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజును అభిమానులు అర్థవంతంగా ఆచరించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం నిర్వహించగా 141మంది రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. బాగేపల్లి తాలూకా చిరంజీవి, పవన్‌కల్యాణ్ అభిమానుల సంఘం సభ్యులు, అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అంద జేశారు. అభిమాన సంఘం తాలూకా అధ్యక్షుడు నేతాజి సర్కిల్ మంజునాథ్ మాట్లాడుతూ తమ అభిమాన నటుడు పవన్‌కల్యాణ్ పుట్టిన రోజును ఈసారి విభిన్నంగా విశేషంగా ఆచరిస్తున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కావడం సంతోషించదగ్గ విషయమని, మానవత్వం కల్గిన నటుడిని ఆదర్శంగా తీసుకుని అదేబాటలో సామాజిక సేవలందిస్తున్నట్టు తెలిపారు. 9ఏళ్లుగా క్రమం తప్పక రక్తదాన శిబిరం, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 141 యూనిట్ల రక్తం సేకరించబడిందని రెడ్‌క్రాస్ సంస్థకు అందచేసినట్టు తెలిపారు. తాలూకాలోని పలు గ్రామాల నుంచి విచ్చేసి రక్తదానం చేసినట్టు ఓ అభిమాని కమల్‌బాబు తెలిపారు. ఆరోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ నాగసాయి లక్ష్మి, నరసింహమూర్తి, సిబ్బంది అరుణ, వెంకటేశ్‌బాబు, మూర్తి, రత్నమ్మ, జ్యోతి అభిమానులు రమేశ్, పవన్, అంజి, గుబ్బి, గణేశ్, విజయ్, హరీశ్, ఇర్ఫాన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న అభిమానులు

బంజారాల సంస్కృతి ప్రపంచానికి చాటాలి

▸▸ అకాడమీ అధ్యక్షుడు గోవిందస్వామి

బెంగళూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బంజారాల సంస్కృతి భిన్నమైనదని ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉందని బంజారా సంస్కృతి, భాషా అకాడమీ చైర్మన్ డాక్టర్ ఏఆర్ గోవిందస్వామి అభిప్రాయపడ్డారు. బంజారా సంస్కృతి భాషా అకాడమీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఎంబ్రాయిడరీ ట్రైనింగ్ కేంద్రాన్ని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవిందస్వామి మాట్లాడుతూ బంజారా అనేది గర్వపడే విషయమన్నారు. వస్త్ర సంస్కృతితోపాటు జానపదం, నృత్యం, సంగీతం భిన్నమైనదన్నారు. గురువు సేవాలాల్‌ను పూజించే విధానమన్నారు. జానపద విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్ డాక్టర్ టీఎం భాస్కర్ మాట్లాడుతూ బంజారాల కళాసంస్కృతి ఇప్పటికీ మనుగడలో ఉందన్నారు. యువతులకు కుట్లు, ఎంబ్రాయిడరీ వంటి శిక్షణలు ఉపాధిని పెంచుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.టి.శ్రీనివాసనాయక, కన్నడ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రుద్రేశ్ అదరంగి పాతోపాటు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్‌ను పరిశీలిస్తున్న గోవిందస్వామి తదితరులు

సమాజంలో భిన్నమైనది గురువు బాధ్యత

సింధి విద్యాసంస్థల డైరెక్టర్ బీఎస్ శ్రీకంఠ



బీఎస్ శ్రీకంఠ

బెంగళూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో భిన్నమైనది గురువు బాధ్యత అని బెంగళూరు సింధి విద్యాసంస్థల డైరెక్టర్ బీఎస్ శ్రీకంఠ తెలిపారు. వందలకొద్దీ వృత్తులు, ఉద్యోగాలతో జీవనం సాగిస్తున్నా అన్నింటికంటే భిన్నమైనది ఉపాధ్యాయ వృత్తి అన్నారు. ఉపాధ్యాయుడిగా జీవనం ప్రారంభించి అత్యున్నతమైన రాష్ట్రపతి హోదా దాకా ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా సెప్టెంబరు 5న జరుపుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతి వ్యక్తి ఎదుగుదలకు ఎంతోమంది ఉపాధ్యాయులు, అధ్యాపకుల సహకారం, చేదోడు ఉంటుందన్నారు. అటువంటి గురువులను గౌరవంగా సత్కరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలెను స్మరించుకోవాలన్నారు. ఆమె భర్త జ్యోతిబాపూలెతో కలసి కులం, లింగ వివక్ష నిర్మూలించేందుకు కృషి చేశారు. దేశంలో మహిళా విద్యకు మార్గదర్శకం వహించారని వివరించారు. అర్కాట్ నారాయణస్వామి మొదలియార్ అట్టడుగు వర్గాలకు విద్య అందించాలనే ఉద్దేశ్యంతో ఆర్‌బీఏఎన్‌ఎం చారిటీని 1886లో హలసూరులో ప్రారంభించారని తెలిపారు. గోవిందమ్మాల్ బాలికల సీనియర్ ప్రైమరీ స్కూల్‌ను స్థాపించారని తెలిపారు. 140 సంవత్సరాలక్రితమే బాలికా విద్యకు బెంగళూరు లో పునాది పడిందన్నారు. ఆర్‌బీఏఎన్‌ఎంకు అనుబంధమైన ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో 27 సంవత్సరాలపాటు ప్రిన్సిపాల్‌గా పనిచేసే అవకాశం దక్కడం సంతోషంగా ఉంద న్నారు. దేశంలో గొప్ప ఉపాధ్యాయుడు స్ఫూర్తి దాత, తత్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యా యుడిగా జీవనం ప్రారంభించి దేశంలో రెండో రాష్ట్రపతిగా ఎదిగారని తెలిపారు. సమాజంలో ఉపాధ్యాయుల అమూల్యమైన సేవలను గుర్తించేందుకు సర్వేపల్లి జయంతిని పురస్కరించుకుని 1962 నుంచి సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవానికి శ్రీకారం చుట్టగా 1994 నుంచి అక్టోబరు 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం ప్రారంభమయిందన్నారు. ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఇదో మహత్తరమైన రోజుగా భావించవచ్చు అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదన్నారు. దేశంలో ఉపాధ్యాయ వృత్తిని ఉన్నతమైనదిగా పరిగణిస్తారని అన్నారు. అన్నివృత్తులకంటే పవిత్రమైనదిగా పేర్కొంటారని తెలిపారు. న్యాయవాదితోపాటు ఎన్నో వృత్తులు ఉన్నా వీరందరికీ ప్రాథమిక నుంచి వృత్తిలో నిపుణుడిగా రాణించేందుకు ఉపాధ్యాయుడే కీలకమవుతారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు ఆదర్శవంతుడు కావాలంటే వృత్తిని ఎంచుకున్నవారు నిబద్ధత, నైతికత, నిరంతరం విద్యార్థులకు కొత్త అంశాలు నేర్పాలనే అభిరుచి ఉండాలన్నారు. ఎంచుకున్న అంశంలో లోతైన జ్ఞానం పొందాలని సూచించారు. జ్ఞాన సముపార్జనకోసం నిరంతరం బోధనల పట్ల ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులను సొంత పిల్లలుగా భావించే సహనం, మనస్తత్వం కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల సమస్యలపట్ల సానుభూతి చూపాలన్నారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంచే సామర్థ్యం ఉండాలన్నారు. సృజనాత్మకతగా బోధించాలన్నారు. విద్యార్థుల్లో అభ్యాస సామర్థ్యాలను, వైవిధ్యాన్ని అర్థం చేసుకునే మేథో సామర్థ్యం ఉండాలని తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఇలాంటి విధానాలు కొనసాగిస్తే సమాజంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా రాణిస్తారని వివరించారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయుడి కష్టం తీరని సమస్యగా ఉందన్నారు. ఏడాదిలో 12 నెలలు జీతం అందడం లేదన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం ప్రసంగాలకే పరిమితంగా మారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సగటు ఉపాధ్యాయుడికి చేయూతనివ్వాలని సూచించారు.

శివపూజ పుణ్యప్రదం



స్వామిజీ ఆశీర్వాదం పొందుతున్న మాజీ మంత్రి లింబావళి

మహదేవపుర, సెప్టెంబరు 2: వీరశైవలింగాయత క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో విభూతిపుర వీరసింహాసన సంస్థాన మఠాధిపతి షడాక్షర బ్రహ్మ డాక్టర్ మహాంతలింగ శివాచార్య మహాస్వామి దివ్యసాన్నిధ్యంలో నియోజకవర్గంలోని ఇమ్మడిహళ్ళిలో ఇంటింటా శివ పూజ, ప్రవచన కార్యక్రమం చేపట్టారు. మహాంతలింగ శివాచార్య మాట్లాడుతూ శ్రావణ మాసంలో శ్రావణమాసంలో శివపూజ చేయడం మరింత పుణ్యప్రదమన్నారు. గురువుల ద్వారా దేవతలను పూజించడం ద్వారా దేవుడి ఆశీర్వాదం లభిస్తుందన్నారు. లోకకల్యాణార్థం నిర్వహించే కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనడం ద్వారా సమాజంలో శాంతి నెలకొల్పేందుకు ప్రార్థించాలన్నారు. ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి అరవింద లింబావళి పాల్గొని మాట్లాడుతూ గురువుల సాన్నిధ్యంలో నిర్వహించే కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఉంటుందన్నారు. వీరశైవలింగాయత క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు మహేంద్ర మోది, గురు బసణ్ణ, రవిచంద్ర, యోగిశ్ ఆరాధ్య, శ్రీనివాస్‌గౌడ, ప్రకాశ్, పదాధికారులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం

బంగారపేట, సెప్టెంబరు 2: పట్టణంలోని వివేకానందనగర్‌లోని కనకభవన్‌లో బంగారపేట తాలూకా మడివాళ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 2023-24 వార్షిక ప్రతిభా పురస్కారం, రిటైర్డు ఉద్యోగులకు సన్మానం నిర్వహించారు. రిటైరైన ఎఇఇ జి నారాయణస్వామి మాట్లాడుతూ 12వ శతాబ్దంలో బసవణ్ణ సమకాలీన శరణలలో మడివాళ మాచిదేవరు ఒకరన్నారు. మడివాళ సామాజికవర్గంలోనూ ప్రభుత్వ ఉద్యోగాలలో ఉన్నత హోదాలను అలంకరించినవారు ఉన్నారన్నారు. తుమకూరు నగరాభివృద్ధి ప్రాధికార డిప్యూటీ డైరెక్టర్ సి.వి.వెంకటేశ్ మాట్లాడుతూ వెనుకబడిన మడివాళ సామాజికవర్గాన్ని ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరాలన్నారు. ఈ రందర్భంగా ఎస్ఎస్ఎల్‌సి, పీయూసీలలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థినీ విద్యార్థులను, రిటైర్డు ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖుడు రంగనాథ్, కోలారు మడివాళ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్, కోశాధికారి అమరనాథ్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు చెందిన రామాంజి, బెస్కాం కంట్రాక్టర్ పరవనహళ్ళి వెంకటేశ్, ఉపాధ్యాయులు శ్యామమూర్తి, వెంకటప్ప, కృష్ణప్ప, నంజుండప్ప తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

బ్యాటరాయస్వామి ఆలయంలో విశేష పూజలు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 2: తాలూకాలోని చిక్కదాసరహళ్ళి గ్రామం సమీపానగల గుట్టపై కొలువైన బ్యాటరాయస్వామి దేవాలయంలో శ్రావణమాసం చివరి శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణ, సంగీత కార్యక్రమం నిర్వహించారు. సమాజ సేవకుడు, కాంగ్రెస్ నాయకుడు ఆంజినప్ప ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు హరీశ్ నేతృత్వంలో పూజలు సాగాయి. అనంతరం ఆంజినప్ప మాట్లాడుతూ రెండేళ్లక్రితం తమ ట్రస్టు తరఫున 101 సామూహిక వివాహాలను ఇక్కడ నిర్వహించామని రానున్న రోజుల్లో కొనసాగిస్తామన్నారు. బ్యాటరాయస్వామి దేవాలయ ట్రస్టు అధ్యక్షుడు బ్యాటరాయశెట్టి, కార్యదర్శి దొడ్డదాసరహళ్ళి మునియప్ప, పెద్దసంఖ్యలో స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై జాగృతి



ప్లకార్డులతో ప్రదర్శన ఇలా..

బెంగళూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నారాయణ నేత్రాలయ వినూత్నంగా 'మ్యూజికల్ నైట్ ఫర్ సైట్' పేరిట ప్రత్యేక సంగీత విభావరి నిర్వహించారు. ఓరియన్‌మాల్‌లో నిర్వహించిన మ్యూజికల్ నైట్ ఆకట్టుకుంది. నారాయణ నేత్రాలయ ఆసుపత్రి, రాజ్‌కుమార్ ఐ బ్యాంకు సంయుక్తంగా చైతన్య కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. ఇప్పటివరకు 2లక్షల మంది నేత్రదానంకు అంగీకరించారని ఈ విధానం మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురాదలిచామని నారాయణ నేత్రాయ సీఈఓ ఎస్‌కె మిత్తల్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యులుగా హెచ్‌క్యూ రిక్రూటింగ్ అడిషినల్ డైరెక్టర్ జనరల్ మేజర్ హరి బి పిళ్ళై ముఖ్యఅతిథిగా పాల్గొనగా ఎయిర్‌ఫోర్స్ కమాండింగ్ ఆఫీసర్ జి.పి.కేప్టెన్ ఎంటిబి రావ్ పాల్గొన్నారు. కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ కుమార్తె లక్ష్మి గోవిందరాజ్, షణ్ముఖ గోవిందరాజులు భాగస్వాములయ్యారు. కంటిచూపు లేక ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారని నేత్రదానం ద్వారా మరొకరి జీవితంలో వెలుగునివ్వవచ్చునన్నారు. రుత్విక్‌రాజన్, కరుణ్‌కృష్ణల మ్యాజిక్ షో, సంగీత విభావరి ఆకట్టుకుంది.

గణితం పోటీల విజేతలకు బహుమతులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 2: తాలూకాలోని సాదలి హోబళి పాఠశాలలో గణితం నేర్చుకునే పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సాదలి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నిర్మలమ్మ మాట్లాడుతూ విద్యాశాఖ, అక్షర ఫౌండేషన్, గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గణితం పోటీలకు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇలా పోటీలతో విద్యార్థులలో నేర్చుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. సిఆర్‌పి ఆనంద్, పిడిఓ శ్రీనివాసప్ప, కార్యదర్శి వెంకటేశ్, ప్రధానోపాధ్యాయుడు నరసప్ప, ఉపాధ్యాయులు ప్రభాకర్, సాధన, నేత్రవతి, సత్యనారాయణరావ్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులతో విద్యార్థుల బృందం

ఆశాజనకంగా వేరుశనగ పంట



ఏపుగా ఉన్న వేరుశనగ పంట

చేళూరు, సెప్టెంబరు 2: తాలూకా పరిధిలో ఈసారి కురిసిన వర్షాలకు వేరుశనగ వేసిన రైతులు పంట ఆశాజనకంగా ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో సాధ్యమైందని పలువురు అంటున్నారు. కూలీల ధర పెరిగిపోతున్నా ఆశించినంత మేరకు దిగుబడి లేక నష్టాలు చవిచూశామని ఈసారైనా మంచి దిగుబడి సాధ్యమని అభిప్రాయపడ్డారు.

ఫ్యూచర్ జనరల్‌లో విన్ ఏర్పాటు

బెంగళూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ జనరల్ ఇండియా లైఫ్‌ఇన్సూరెన్స్ సంస్థలో మహిళల నేతృత్వంలో సరికొత్తగా ఉమెన్ ఇన్ ఇన్సూరెన్స్ (విన్) విభాగాన్ని ఏర్పాటు చేశారు. బీమారంగంలో డిజిటలీకరణ తోపాటు మహిళలను ఆకర్షించడం లక్ష్యంగా ఉందని సంస్థ ఎండీ సీఈఓ అలోక్ రుంగ్టా అభి ప్రాయపడ్డారు. ప్రతి వినియోగదారుడికి వీలుగా బీమా పాలసీలు ఉన్నాయన్నారు.

అధికారుల ఆకస్మిక తనిఖీలు



జరిమానా విధిస్తున్న అధికారులు

బాగేపల్లి, సెప్టెంబరు 2: తాలూకా కేంద్రమైన బాగేపల్లి పట్టణంలో ఆహార సురక్షత అధికారులు సోమవారం అకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాదారులకు నోటీసు జారీ చేసి జరిమానా విధించారు. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ ఫ్యా మిలీ దాబా సెంటర్‌లలో తనిఖీల వేళ అపాయ కరమైన అజినోమోటోను మోతాదు మించి వాడుతున్నట్టు గుర్తించారు. కొన్ని హోటళ్లకు రూ.5వేలు జరిమానా విధించి నిర్వాహకులను హెచ్చరించారు. డాక్టర్ సత్య నారాయణరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ప్రజల సురక్షత కోసం హోటళ్లను తనిఖీ చేయనున్నట్టు తెలిపారు. దాడులలో డాక్టర్ ధర్మేంద్ర, ప్రభుత్వ ఆసు పత్రి సిబ్బంది, ఆహార అధికారి ఫక్రుద్దీన్ సాబ్ పాల్గొన్నారు.

నిడుగల్‌ను పర్యాటక కేంద్రం చేస్తాం: ఎంపీ



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, వేదిక సభ్యులు

పావగడ, సెప్టెంబరు 2 : రెండో హంపీగా పేరుగాంచిన నిడుగల్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని ఎంపీ గోవింద కారజోళ పేర్కొన్నారు. శ్రావణ మాస చివరి సోమ వారం సందర్భంగా నిడుగల్ ఉత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిడుగల్ ప్రాంతంలోని పరిసరాలు, దేవాలయాలు, పురాతన విగ్రహాలు కనువిందు చేస్తున్నాయన్నారు. మలే నాడును తలపించేలా ఉన్నాయన్నారు. వాల్మీకి సంజయ్ కుమార్ స్వామీజీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిడుగల్ ఉత్సవాలు ప్రభు త్వం తరఫున జరిపించేందుకు తన వంతు కృషిచే స్తానని తెలిపారు. నిడుగల్ ఉత్సవాలను ప్రభుత్వం తరుపున జరిపిం చేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తానని ఎమ్మెల్యే వెంకటేశ్ తెలిపారు.